# ఆవలి పక్షం

ధనుర్మాసపు చలికి, విజయ యింకా ముణగదీసుకొని గడ్డం దాకా దుప్పటి లాక్కుంటున్నా వాళ్లమ్మ వదిలిపెట్టలేదు.

"ఏమే విజ్జీ, ఇంకా బుజ్జిపాపవై పోతున్నావ్ మరీనూ. నీక్కాదుటే చెప్పేది- తెల్లవారుతున్నదని"- అని ఆమె అరగంట నుంచీ మొత్తుకొంటూనే వున్నది. తను యిటునుంచి అటూ, అటునుంచి యిటూ- మంచంమీద పొర్లుతూనే విననట్టు నటిస్తూనే వున్నది. ఇంతలోనే నాన్నగారు లేచి చుట్ట వెలిగించి వదిలిన మొదటి పొగ మేఘంతో ఊపిరాడక, ఒడలు విరుచుకుంటూనే నిలబడి ఓణీ సర్దుకొన్నది.

పండక్కి వచ్చిన బావ- ముచ్చటపడతాడని అమ్మా, అక్కయ్యా- నిన్నటి రాత్రి నుంచీ చెప్పిన మాటలు మరిచి పోయిగాదు ఆ బద్ధకం. పద్దెనిమిదేళ్ల పిల్లకు- తనకింకా గొబ్బెమ్మల సరదా ఏమిటనే వేదాంతమూగాదు. నిజంగానే చలి.

నాన్నగారి చుట్ట దివిటీ వెలుగులోనే, నడిమింటి తలుపులు తెరిచి తడుముకుంటూ ముందుకు సాగి, ప్రహరీగోడ దాకా ఆవలింతల్తో నడిచి-ఆవును కట్టేసిన చోటు జ్ఞాపకం వచ్చి కుడిచేతి వేపు తిరిగిందో లేదో- ఎదురు దెబ్బ కాలికి తగిలినట్లయి ముందుకుపడి, చేతికేదో మెత్తగా తగలగానే-"అమ్మో-నాన్నో" అని వెర్రి కేకలు పెట్టింది విజయ.

నాన్నగారు మంచానికానించి వున్న దుడ్డుకర్ర లంకించుకొని-లోపల్నించే "దొంగలు, దొంగల్రోయ్" అని అరుస్తూ బయటికొచ్చాడు. ఊరు ఊరంతా ప్రతిధ్వనించిందా? గడియకు పెట్టిన పాత యినప గరిటె ఒక చేత్తోనూ, సగం మసెక్కిన లాంతరు యింకోచేత్తోనూ అమ్మా, తాపీగా క్రాపింగూ గళ్లపైజమా సర్దుకొంటూ బావా, బావనీడగా అక్కా, అందరి వెనకా ఆవలి వరండాలో పడుకొని వున్న బావతోపాటు పండక్కి విచ్చేసిన బావ పింతల్లి కొడుకు, చెక్స్ లుంగీ కట్టు-నోట్లో కాష్టంలాగా సిగరెట్టుతో టార్చిలైటు వేస్తూనూ-మొత్తానికి ఇంటిల్లిపాదినీ వెర్రికేకతో పోగుజేసిన తనూ, పొగమంచులో అస్పష్టంగా కనిపిస్తున్న చెట్లూ- అంతా విభ్రమంతో "దేని కోసమో" వెతుకుతున్నారు. అక్క చేతికి లాంతరిచ్చి అమ్మ తనను గుండెకు హత్తుకొన్నది. అందరూ "ఎక్కడే? ఎక్కడ?" అని తనే దొంగ అని అరిచి నట్టుగా అడుగుతున్నారు.

తనకన్నా ఎక్కువగా నాన్నగారి దుడ్డుకర్రే వణికిపోతూంటే, చివరికి ఆ చుట్టపబ్బాయి చేతినుంచి టార్చి లాక్కొని బావ లైటు వేశాడు. అమ్మ చేతి గరిటె కాడమీదినుంచి దాని కాంతి నేలమీద పడగానే అందరికీ కన్పించింది-నిన్నటి సాయంత్రం వరకూ గోడకానించి వున్న పాత నులకమంచం. దాని మీద హోల్డాలు పరుచుకొని, పైన మంచు పడకుండా రంగు రంగుల పంజాబీ రజాయి కప్పుకొని, అంత హడావిడిలోనూ నిద్ర పోతున్న 'దొంగ'.

నాన్నగారు దుడ్డుకర్రతో రజాయ్ మీద పొడుస్తూ ''హేయ్- ఎవర్రా నువ్వు? ఎవర్రా'' అంటుంటే, అమ్మే అడ్డు వచ్చి- "ఉండండి. మీరు పట్ట పగలే కుంటి దొంగల్ని పడతారు మరీనూ. దొంగ లేడూ, దయ్యం లేడూ. ఎవరో తెలిసినవాళ్ళే అయ్యుండాలి'' అని కర్రను లాగేసింది.

''అయితే మాత్రం....సొంత యిల్లను కొన్నాడా? పిల్లను యిట్లా భయ పెట్టి''

నాన్నగారి వాక్యం పూర్తిగాక మునుపే, రజాయి కంపనం. టార్చిలైటు కళ్ళమీద పడకుండా చేతులడ్డం పెట్టుకొని-"నేను మామయ్యా, సుందరాన్ని, రాత్రి మెయిల్ దిగివచ్చాం- నేనూ వెంకటస్వామి. ఎవర్ని పిలిచినా చలి గాబోలు మీరెవ్వరూ లేవ లేదు'' అంటున్నది ఆ ఆకారం.

తమ యిల్లున్న పెద్ద ఆవరణలోనే సగం పడిపోయిన గోడలతో, శిథిల మవుతూన్న బదిరీ నారాయణ మామయ్యగారి ఇంటి పొరుగుతో, తన చిన్న

తనం నుండీ వింటున్న దొంగ భయం ప్రత్యక్షరూపం దాల్చి అంతలోనే మాయమై పోయింది విజయకు. ఇంతలో బాగా వెలుతురు విస్తరించింది.

నాన్నగారు మాత్రం- ఆ 'దొంగ' మాటలకు శీతల చంద్ర కిరణాలతో ముడుచుకుపోయిన కమలంవలె బిగుసుకు పోయారు. తనను పట్టుకు నిలిచిన అమ్మ చేతులు నరాల పట్టు సడలినట్లుగా అప్రయత్నంగా జారిపోతున్నట్లు గూడా గ్రహించింది.

అప్పుడే మెళకువ వచ్చి- "దండాలు దండాలు కేశవయ్యగోరూ" అంటున్న గొల్ల వెంకటస్వామి మాటలుగూడా నాన్నగారు వినిపించుకొన్నట్లు లేదు. ఒక్కక్షణం కంగారుపడి ఆరిపోయిన చుట్టముక్క నావలపారేస్తూ కోపంతో అమ్మ మీదనే విరుచుకుపడ్డారు. "ఏమే దేభ్యం-అట్లా చూస్తూ నుంచున్నావ్. ఆ ఆవును విప్పి యిటు తీసుకురా" అని అక్కడ నిలబడ లేదు.

ఆవు- బదిరీనారాయణగారి పాడుబడ్డ పంచపాళీలో కట్టివేసి వుంది. నాన్న వెనక, తిరునాళలో రథం వెనక నడిచే ఉత్సవాహనాల్లాగ, అందరూ తిరిగిపోతున్నారు. అసలు భారతంలో కర్ణుడైన తనను మాత్రం వీళ్ళంతా మరిచిపోయారు. కాని మంచంమీంచి సుందరం లేచి-"ఏం విజయా జ్ఞాపకం వున్నానా?" అని పలకరించినపుడు, తనకు నిజంగా సిగ్గు ఆవరించి కళ్ళు కిందికి వాలిపోయినా, ఆ వయస్సులో అబ్బే సహజ విద్య- ఎదుటి వాళ్ళ స్వరూపాన్ని క్షణాల్లో అంచనా కట్టగల శక్తితో- "అతడు దాదాపు ఆజాను బాహుడైనా కళ్ళు చిన్నవి" అని నిర్ధారించుకొని, వెనక్కు పరుగులంకించుకో బోతూండగా, తన వెనకాలే వచ్చి, ఆ చుట్టాలబ్బాయి దాదాపు తాకుతూ, తన మెడ మీదనే గాలి వదుల్తున్నట్లుగా గ్రహించి, అటు గాకుండా యిటు తిరిగి దూరంగా జరిగి చప్పున యింట్లోకి పోయింది.

తనను చేసుకొంటాడనేగా అక్కాబావా అతగాణ్ణి వెంటేసుకొచ్చింది? తను గడప దాటిపోతూ, ఓరకంటి చూపు నుంచి అ సుందరం తన పలకరింపు ప్రశ్నకు సమాధానం ఆశిస్తున్నట్లుగా అక్కడే నిలిచి వుండటం తను గమనించకపోలేదు. మళ్ళీ అసలు తను గొబ్బెమ్మల స్థాపనకు గదా యింత హైరానాపడింది- అని స్మృతికి వచ్చి తిరోగమనం చేస్తూండగా, యింట్లో అమ్మా నాన్నా అక్కా సంభాషణ విని అక్కడే తనూ ఒక తెల్ల గొబ్బిలాగా స్థంభించిపోయింది.

''సిగ్గులేక యింకా వరసలు కలుపుకోవటం"

''మరే! నాయన పదేళ్ళపాటు కోర్టుల పాలుజేశాడా? పదివేల రూపాయలు వీళ్ళ ముఖాన పోశామా? ఇక యీనగారి హయాం రాగానే అంతా మానిపోయిందనుకొన్నాడా? ఈ మాయదారి మాట కలుపు ఆ వంశం లోనే వుందాయె''

"ఈ తొమ్మిది పదేళ్ళనుండీ ఎక్కడ ఊరేగినట్టే? యిప్పుడు హఠాత్తుగా ఎందుకు ఊడిపడ్డట్టు?" అంది అక్క.

"ఇదుగో—నీకే చెబటం. విజయను ఆ చాయలకు పోనీవద్దు"

"నాకు తెలీదుటండీ. ఇంతకీ ఆవు కట్టేసిన చోట ఏమైనా బాగు చేయిం చాలంటారా?" అంది అమ్మ.

"ఏడ్చావ్లే. దిక్కున్నచోట చెప్పుకోమను. కోర్టులో గెలవంగానే పండగ యిందా? ఆ స్థలం వాడి తీరతాను. రేపట్నించీ గేదెకు గూడా ఆ ఖాళీస్థలం లోనే కట్టుగొయ్య పాతించు" అని నాన్నగారి తీర్పు.

తల్లి గొబ్బెమ్మ చుట్టూపిల్ల గొబ్బెల్ని అమరించి, పసుపూ, కుంకుమా చల్లి బంతిపూల అలంకరణ చేస్తూన్న విజయకు—నాన్నగారికోపం, అమ్మ భయం, అక్క ఆత్రుతా, వాళ్ళ మాటల్లో ముప్పిరి గొన్న ద్వేషం—అంతా నిజమా? భ్రమా? అనిపించింది. దాదాపు తన చిన్నతనం నుండి వింటున్న యీ వ్యాజ్యెం మొన్న మొన్ననే తేలినట్లుగా చూచాయగా మాత్రమే తనకు తెలుసు. అదిగూడా భారతీ, అనసూయా చెప్పగా.

ఆ యింటికీ యీ యింటికీ మధ్య ఖాళీస్థలం దాదాపు యాభై గజాల మేర తన హక్కు భుక్తాల్లోనే వున్నదని నాన్న వేసిన దావా బదరీనారాయణ గారి హయాంలోనే రెండు కోర్టులు తిరిగి, చివరకు ఆవలిపక్షంవారికి ఖర్చుల్తో సహా డిక్రీ అయిందిట. ఆ బదరీ తాతయ్యా గతించాడు. ఆయన తమ్ముడు పట్టాభి గారూ యిప్పుడు లేరు. ఇంత చరిత్రవున్న ఆవలిపక్షం వారసుడా, ఆ దూరాన కళ్ళజోడు తీసేస్తూ మూగ వెలుగులో ముసిముసిగా నవ్వుకొంటున్న సుందరం?

నిజంగా యిన్నేళ్ళ తర్వాత ఎందు కొచ్చినట్లు? తెల్లనిక్కరు వేసుకొని, తెల్ల బనీనుతో దండీలు, బస్కీలు తీస్తున్న ఆ పాడుబడ్డయింటి కొత్తయజ మానితోనా—తను చిన్నతనంలో ఆడుకొన్నది? ఏమో, ఆవునుకట్టేసినారాసి అందం, ఆ వరండాకు యిప్పుడు ఎట్లా వచ్చింది? తనక్కడికి వెళ్ళగూడదు

గదా. తనకెందుకు పోనీ అనుకొన్నా రేపు తన నేస్తం భారతి వచ్చి అన్ని సంగతులూ వాగిపోదూ? మరి భారతి 'వాళ్ళ' బంధువేగా?

*　　　*　　　*

భోగినాడు తలంట్లు పోసుకొని, పిడపచుట్టు తీసి తలార పెట్టు కొంటుంటే, అమ్మా అక్కా అనుకొంటున్న మాటలు అలలమీద తేలివచ్చే మందమారుతంవలే విజయ చెవిని సోకుతునే వున్నవి. ఆ "చుట్టాల పిల్లవాడి" ఆస్తిపాస్తుల్ని గూర్చి చెప్పిన మాట చెప్పకుండా వసతాగిన శిశువులాగా అక్క వాగుతూనే వుంది. అడిగిన ప్రశ్నే యింకో పద్ధతిలో అడుగుతూ అమ్మ తృప్తిగా తనలో తను స్వగతం చెప్పుకోటం గూడా తెలుస్తూనే వుంది.

"ఏమోనే—రాజీ! మనకు తూగుతారో తూగరో. మీ నాన్న సంసారం సంగతి తెలుసుగా. మేడిపండు. పాత అప్పులకు మొన్న ఆసాములకు చెరువు మడి తాకట్టు పెట్టినట్టున్నది. ఇంట్లో యింతగూడా పొక్కలేదు సుమా. ఏం మనిషో, కోర్టులచుట్టూ తిరిగి, హైరానపడినా మూడొందలరవై రోజులూ నిండు కుండేగదా. కష్ట సుఖాలకు కాకపోతే మరెందుకే నాజన్మ, తెలీకడుగుతాను రాజీ—మీ ఆయన నీతో జమాఖర్చులు ముచ్చడిస్తాడుటే".

అక్క ఆ మాటలకు జవాబు చెప్పకుండా, మళ్ళీ మొదటికే వచ్చింది. ఎంతైనా బస్తీకాపురం వెలగబెడ్తున్నదాయెను.

"నీకా అనుమానం అక్కర్లేదమ్మా. వాళ్ళ చెల్లి, అక్క నా మాటంటే పడిచస్తారు. మా వారంటే ఆ అబ్బాయికి బాగా గురి"

"ఇంతకీ రాసిపెట్టాలిగా. నాన్నగార్ని చూచాయగా కదిలించమని చెప్పకపోతివేమే తెలివీ"—కూతురి తెలివితేటలకు దిష్టి తగలకుండా ఆప్యాయంగా అమ్మ అంది.

పెళ్ళి మాటలు తనలో ఏ వికారాన్నీ కలిగించలేదు. అసలు ఏ భావమూ స్ఫురించలేదు. తను సంపూర్తిగా సంక్రాంతి పండగ హడావిడిలోనే నిమగ్నమైపోయి, తెల్లవారు జామునే పొగడచెట్టు కింద రాలిన పూలనన్నీ ఏరి, బంతిమాలలు కూర్చి, అప్పుడప్పుడే విరబూస్తున్న ముళ్ళ గోరింట్లను బుట్టనిండా కోసి భారతి కోసం, అనసూయ కోసం దాచి పెట్టింది. చేటనిండా వడ్లు నింపుకొని గంగిరెద్దు మేళగాళ్ళకు, శ్రీశైలం చెంచు దొరలకూ, బుడ బుక్కల వాళ్ళకూ పంచుతూ ప్రహరీ గోడ మంచె దగ్గరే నిలబడింది.

వస్త్రదానం చేయమని గంగిరెద్దు వాళ్ళు పాతగుడ్డలకోసం అర్థించినపుడు తన పాత ఓణీ తెచ్చి యిచ్చి, ఏటా వచ్చే మామిళ్ళపల్లి హరిదాసుకోసం

బియ్యాన్ని పాలడబ్బాలో నింపి, రథం ముగ్గుమీద తను పెట్టిన పిల్ల గొబ్బె మ్మల్ని మళ్ళీ లెక్కబెట్టి, అవి పద్దెనిమిదేనని నిర్ధారించుకొని, వాటిని కాళ్ళతో మట్టబోయిన పిల్లల్ని అదిలించి, ఎందుకో బదిరీ నారాయణగారి యింటివేపు దృష్టి సారించింది.

అక్కడ పోగైన బిచ్చగాళ్ళు, పాటగాళ్ళు గుంపుగా నిలబడి కదిలి పోరేమా అని అనుకొన్నది. వడ్లు లేవుగదా- మరి ఆ మనుమడు సుందరం వాళ్ళందర్నీ ఎందుకు నిలుపుతున్నాడో అర్థంకాక, చిల్లర డబ్బులు పంచు తున్న గొల్ల- వెంకట సామిని చూసి "ఓహో" అని అర్థం చేసుకొని, వాళ్ళింటి ముందు కళ్ళాపి చల్లి తమ మాదిరిగా పెద్ద ముగ్గు వేసిందెవరా అని ఆశ్చర్య పడుతుంటే, ఆవు పాల చెంబుతో కరణంగారి మనుమరాలు సుబ్బులు అటు వెళ్తూ ఆగి- "ఏమిటోయ్ చెంచు వాళ్ళ పాటల్ని ఆయన వింటూ ఏదో చేస్తు న్నాడు?" అని ప్రశ్నించగా, తను వాళ్ళ ముందు వరండాలోకి అరుగెక్కి తొంగి చూసింది.

సుబ్బులు కూడా తన భుజం వెనక మునివేళ్ళమీద నిలబడి పరికించి- ఓహో టేపు రికార్డరు అన్నది. అందుకా యీ రెండు రోజుల్నుంచి యింటి పాత వైరింగునంతా హడావిడిగా బాగు చేయించుకొన్నది అని విజయ ఆశ్చర్య పోయి, యీ సంవత్సరం పిట్టల దొర ప్రహసనం వినలేదుగదా, అదిగూడా రికార్డు చేస్తే ఎంత బాగుండును అనుకొని, సుబ్బులుతో ప్రకాశంగా- "ఐదా రేళ్ళ నుండీ వీధి భాగవతులు కనిపించటంలేదేమోయ్?" అన్నది. ఆ పిల్లకు మాత్రమేం తెలుసు- వీధి భాగవతులు సినిమాలగోల వచ్చాక, చెట్టుకొకరు పుట్టకొకరు పొట్ట చేతబట్టుకొని పోయారని.

వెడుతూ వెడుతూ సుబ్బులు ఒక నైతిక సమస్యను తనమీద విసిరేసి పోయింది.

"ఆయన్ని.... యివ్వాళ పండగ్గదా- భోజనానికి పిలుస్తున్నారా?" ఆయన- ఆ సుందరమేగదా.

"ఏమో!....ఏమో,.... అమ్మకు తెలుస్తుంది" అని తను అతికీ అతకని సమాధానం యిచ్చి లోపలికి పోతూంటే, వంటింటి కడపమీద పోళీలు వత్తు తున్న అక్క, ఆ సమస్యకు సులభ పరిష్కారం చెబుతుంటే విని అక్కడే ఆగిపోయింది.

"కులం పట్టింపులుగూడా లేనట్లుందిలే. గొల్ల వెంకటసామి పండగ విందు చేస్తాడేమోలే"

రెండో కూతురు పెళ్ళి సంబంధం ఎవరి చెప్పులూ అరగకుండా తేలిగ్గా కుదరబోతోన్నదన్న ఆనందంలో సకల మానవాళి అపరాధాల్ని క్షమాశక్తితో చూడగలిగిన అమ్మ- "మనకెందుకులేవే పోనిస్తూ! ఈ రోజుల్లో మడీ మన్నూ అంటే కుదరవుగా" అని పరాకుగా అంటున్నది.

సుబ్బులు వెళ్ళిపోగానే విజయ ఏదో ఉదాసీనత పొద్దుటినుంచీ చెంగణాలు తొక్కుతూ, చెణుకులు విసిరిస్తూ, సోయగంగా, నిరాకారంగానే వంపులు వంపులు తిరుగుతున్న ఉత్సాహాన్ని అమాంతం కబళించివేసినట్లుగా భావించి, చిన్ననాటి నుంచీ చెలికత్తెలయిన చెట్ల మధ్యకు పోయింది.

ఊళ్ళో ఎక్కడాలేని పొన్నచెట్టు పొగడ చెట్ల జంట, బావి పక్కనే గన్నేరులు మూడు రకాలవి, వాటినానుకొనే సపోటా, మహావృక్షంగా పెరిగిన వేపమాను, దాని వాసనకు సర్పభయం వుండదని సరసనే పెంచిన సంపెంగి పొదా, ప్రహరీగోడ ననుసరించుకొని స్వయంభూలైన నాలుగు జామిచెట్లు. వాటితో చెలిమి పుట్టుకతోనే అలవడిందా అన్నట్లుగా తనూ, భారతీ, ఆచార్లుగారి శిక్షణలో సరిగమలనుండి, కృతులు కీర్తనల దాకా ఎదిగినది, యీ చెలుల మధ్యనేగదా. ఎండకు నీడలు, మంచులో డేరాలు, వానలో గొడుగులు, హృదయ తాపానికి తత్వగంధలేపనాలివి.

అక్క రాజేశ్వరి మాటల్లో ఆ సుందరం గురించి కేవలం నిరాదరణ స్ఫురించినా తను కల్లోలపడేదిగాదు. ఈర్ష్య, ద్వేషం తనకెప్పుడూ వెతను కలిగించి, దిగులు చీకటిలోతుల్లో పడవేస్తూంటాయ్. ఒకే రక్తం పంచుకు పుట్టినా, అక్కతో ఎన్నడూ తను భారతితోనూ అనసూయతోను ఆడుకొన్నట్లుగా, గుండె విప్పి అమాయకపు విషయాలు, అన్యోన్య సమాచారాలు లౌకిక సమస్యలూ మాట్లాడుకొని ఎరగం గదా.

హఠాత్తుగా జ్ఞానోదయమైనట్లు, మళ్ళీ ఆ పొన్నచెట్ల జంటను చూస్తుంటే స్మృతికి వచ్చి—బాల్యంలో యీ సుందరంతోనేనా యిక్కడ ఉయ్యాలలాడుతుంటే అమ్మ కేకలు వేసేది అనుకొన్నది. అనుకొన్నదోలేదో సుడిగాలిలాగా భారతి వచ్చి "ఇక్కడున్నావుటే వనకన్యకా? నీతో పని వుంది. ఫిడేలు పెట్టె తీసుకొని చప్పున రావాలి" అని జడపట్టుకొన్నది. భారతిలో ఏమీ దాగదు. సంతోషమొచ్చినా అంతే, కోపం వచ్చినా అంతే.

కిందటేడు నందికేశుడి నోములు వాళ్ళమ్మ పట్టి, అడ్డెడు మినప్పప్పు గారెలు ఖర్చుగాక తన్ను పదే పదే భారతి బలవంతం చేసి తినిపిస్తూ, నాన్న

మీద విరుచుకుపడినట్లుగా చెప్పిన మాటలు గూడా తనకు కోపం తెప్పించక పోగా, యింకా ఆలోచనల్లో పెనవేసినాయ్. "విజ్జీ మీ నాన్నను అందరూ నోర్టు పక్షి అంటారు ఎందుకో తెలుసా? మనవంటి వాళ్ళ యిళ్ళూ, పొలాలు చవుకగా దిగమింగాలని ఆ రాయుడమ్మ ఎత్తులు వేస్తూంటే, అయినవాళ్ళందరితో పగ తెచ్చుకొని ఎందుకే ఆ కుత్సితుడితో చేతులు కలపటం? చిన్న కరణంగారి నిమ్మతోటలో దొంగతనాలు చేయించి చేయించి, చివరకు వాళ్ళకు విసుగూ భయం పుట్టించి, సూక్ష్మంలో లక్షరూపాయల తోటను పాతికవేలకు కొట్టేసు కొన్నాడా? అల్లుడి జాగాకు కలిసి వస్తుందని ఎన్నో పన్నాగాలు పన్ని, తూర్పు బత్తులు వీరాచారి సందు ముందు పోట్ల గొడ్లను కట్టేసి, వాళ్ళ ముసలమ్మను గేదె పొడిస్తే మళ్ళీ వాళ్ళమీదకే తగాదాలకు వెళ్ళాడా?

పాపం, వీరాచారి యీ బాధలు పడలేక యిల్లమ్ముకొని మా పెదనాన్న గారి సావడిలో చేరాడా లేదా? ఆ దౌర్భాగ్యుడికి మీ నాన్న కాయితాలు రాయటం ఏమిటే? చూస్తూండు. మా నాన్నగారు అంటూనే వున్నాడు—బదిరి నారాయణ తాతగారి యిల్లు, మీ యిల్లుగూడా కాజేస్తాడు. వాడి మాటలు వినిగాదుటే, మీ నాన్న యింత జ్ఞాతివైరం పెంచుకొన్నది? మా సుందరం అన్నయ్య రానీ. యీ పప్పులనీ ఉడకవు. మీ నాన్నకు మీరైనా చెప్పలేరటే" అని కడిగేసింది గదా.

ఎటువంటి కఠిన సత్యాన్నైనా అంత విశ్లేషణతో చెప్పగలిగిన భారతి మీద కోపం ఎట్లా వస్తుంది? దాని ముందు తను చిన్నపిల్లకిందే లెక్క.

తను యింట్లోకి వెళ్ళి ఫిడేలు పెట్టె తీసుకొని బయటకొస్తుంటే "ఎక్కడికే?" అంటున్న అక్కకు ముక్తసరిగా "భారతి" అని సమాధానం చెప్పి, వాకిట్లో "ఎక్కడికే?" అని తను భారతినడిగింది.

''రా'' అని భారతి ముందుకు సాగింది. ఆ పోక పోక సుందరం వాళ్ళ వరండాలో నిలిచిపోయిన కాళ్ళతో "మా అన్నయ్య ఊర్మిళాదేవి నిద్ర పాటను రికార్డు చేస్తాడు. నువ్వు బ్యాక్‌గ్రౌండు మ్యూజిక్" అంటూ ఆగి పోయింది.

తనా? యిక్కడికా? అని ఆశ్చర్యం పూర్తి గాకముందే "బ్యాక్‌గ్రౌండు మ్యూజిక్ గాదు. సంప్రదాయ పాటలకు సరళ సంగీత దర్శకత్వం" అంటూ సుందరం బయటకు వచ్చాడు.

భారతికి ఎన్ని పాటలు వచ్చో లెక్క గట్టటం తన వల్లకాదు. అవ లీలగా, ఏక సంతగ్రాహిణిగా పాడే సినిమా పాటలు అటుంచి, సీత సమర్త

పాటనుండి అష్ట పదులు, శ్రీకృష్ణలీలాతరంగిణి తరంగాలు, భద్రాద్రి రామదాసు కీర్తనలు బ్రహ్మంగారి తత్వాలు, భజగోవింద శ్లోకాలు- ఒకటేమిటి శిష్ట పరంపరననుసరించే కుటుంబాల్లో అనుశ్రుతిగా వస్తున్న ఏ పాటైనా దానికి నల్లేరుమీద బండి నడక.

తను శృతి సరిజేసుకొని కమాను రెండుసార్లు కదిలించగానే- "యింకా సన్నగా, పాటకు ప్రాధాన్యం, వాద్యం వినబడీ వినబడనట్లు, పరిపూర్ణత కోసం" అని సుందరం తనను హెచ్చరించాడు.

ఊర్మిళాదేవి నిద్ర టేపు రికార్డింగు అరగంటపైనే పట్టింది మధ్య మధ్య సుందరం సవరింపుల్తో. తిరిగి ''యిదిగో- ప్లే వినండి'' అని భారతి గొంతును వినిపించాడు టేప్ వేసి.

''అబ్బ భారతీ'' అని మెచ్చికోలు మాట పూర్తిగాకముందే అనసూయ వచ్చి ''సుందరం బావనూ నిన్నూ వెంటనే భోజనానికి పిల్చుకు రమ్మన్నదే మీ అమ్మ'' అని అర్జెంటు కబురు తెచ్చింది భారతికి.

''ఇదిగో క్షణంలో'' అని సుందరం ఆ కబురుకు సమాధానం చెబుతూనే తన వంక తిరిగి- ''సెభాస్ విజయా ఇక నుంచి అన్ని రికార్డింగులకు నీదే సంగీత నిర్వాహణ : అంటే నిజంగా సంగీత దర్శకురాలివి'' అని చిరునవ్వు. వ్యంగ్యం, వెటకారం లేని చిరునవ్వది. వాళ్ళు మెట్లు దిగుతుంటే గొల్ల వెంకటసామి ఎదురొచ్చి ''బాబూ సెలవిప్పియ్యండి. మోటారు బండికి టయమయింది'' అంటున్నాడు.

''వెంకటసామి పాటలన్నీ అయిపోయినట్లేనా అన్నయ్యా''

''ఆహాఁ ఎనిమిది సుద్దులు పాడాడు. ఒక్క వెర్రికేక మాత్రమే వేశాడు.''

''అదేమిటి?'' అని అనసూయ.

"అదేమిటి?" అని భారతి.

"వానికీ సినిమా గాలి సోకింది. గొర్రెల అదిలింపు కేకలేస్తే యెర్రిగొల్ల అంటారుట. అందుకని సినిమా కేక"

అయితే యిందుకన్నమాట వెంకటసామి వచ్చింది.

తను యింట్లో అడుగుబెట్టకముందే సన్నని గొంతుతో అక్కయ్య మందలింపు "ఎక్కడ్నించే....ఆ అబ్బాయి చూస్తే ఏమనుకొంటాడే''

"ఏ అబ్బాయి?''

"అబ్బ. ఎంత నంగనాచివే. ఈ పేడ కుప్పల్లోనే వుంటావో, హైదరాబాదులో కాపురం పెడతావో తేల్చుకో'' అని రాజక్క విసురుమాట.

అమ్మ!! తను పుట్టి పెరిగిందెక్కడో? ఈ పేడ కుప్పల ఊళ్ళోనే గాదూ. తనకు తెలీదా హైదరాబాదు? ఇంటరు ఒక సంవత్సరం అక్కడేగా వెలగబెట్టింది? ఈ బస్తీ బడాయిలన్నీ యిద్దరు పై మనుషులు భోజనానికి వస్తే బియ్యం దగ్గిర్నించీ అన్నీ తడుముకొనే కాఫీ కప్పుల సంస్కారాలు. గడ్డ పెరుగంటే అక్క పిల్లలు ఎరుగుదురా? మళ్ళీ నెలాఖరొచ్చేసరికి, ఆ కాఫీ కప్పుకూడా ఆడంబరం చూపించదు. తనున్న ఆ సంవత్సరమంతా ఆకాశం చూసి ఎరగదు. నక్షత్ర కన్యలు అక్కడుండవు.

రెండో మనిషి పట్టని వంటగదీ, తల్లిదండ్రులొస్తే చాలని ముందు గది. పక్కవాళ్ళ పేర్లు తెలీని సంఘజీవనం. రోజూ సమ్మెలు. అంత వివరీతంగా యిక్కడి కొచ్చి వర్ణించే హుస్సేన్‌సాగర్‌లో హత్యలు, ఆత్మహత్యల ఉబ్బిన శవాలు.

"మాకు స్కూటరుంది. టీ.వీ.లో సినిమా చూశావా? క్రికెటు ఆట చూడ లేదుటే. మా గ్యాసు పొయ్యిలో అయిదు నిమిషాలు వంట. ఇవ్వాళ హోటల్లోనే భోజనం" మనిషికి ఎనిమిది రూపాయలు. తండ్రి తద్దినాలు ఎగవేసేవాళ్ళు. ఫస్టుతారీకొస్తే భయపడేవాళ్ళు ఎందుకొచ్చిన కుసంస్కారాలు? భయంతో బతుకు. అరగని మెతుకు. ఆడంబరాల అతుకు. మధ్యతరగతిట. దేనికి మధ్య? మిధ్య అయిన త్రిశంకు స్వర్గానికి భూమిమీద ఆడంబరాలకుమధ్య" అని కోపంగా అనుకొని తన తాపం చల్లార్చుకొన్నది.

కనువు పండుగనాడే సుందరంవాళ్ళ యింటి మరమ్మతుల పని ప్రారంభమైంది. సున్నం, ఇసుక, సిమెంటు ఒక పక్క దిగుతుంటే, సామాన్లతో లారీ ఒకటి నిండుగావచ్చి వీధిసంతా ఆక్రమించి ఆగిపోయింది. జాజి చెక్కల పెట్టెలు, కార్డు బోర్డు పెట్టెలు, రెండు అద్దాల బీరువాలు, కుర్చీలు, బల్లలు.

అన్ని పుస్తకాల పెట్టెలా? అని విజయ ఆశ్చర్యపోతూండగా, మళ్ళీ భారతీ, అనసూయా అక్కడ హడావిడి చేస్తూనే సామాన్ల సర్దుబాటులో చేయి అందిస్తూ, మధ్యమధ్య తను గూడా వస్తుందేమోననే ఆశ నిరాశ చేసుకుంటూనే సౌజ్ఞలు చేస్తూ, వీలయినప్పుడు కబుర్లాడుతూ ఎన్ని సంగతులు చెప్పారు?

"మా అన్నయ్య యిక్కడే వుంటాడిక"

"మరి ఉద్యోగం మానుకొన్నట్లేనా? నిక్షేపంలాంటి జీతంగదుటే. ఈ పల్లెటూర్లో ఏం బావుకుంటాడు! అంత పెద్ద పట్నంలో వుండి వచ్చినవాడికి ఏం తోస్తుందే?" అని అనసూయ.

భారతిది తనలాంటి మనస్తత్వమే.

"బోడి ఉద్యోగం. పొద్దున లేస్తే వందమందికి సలాములు. మాగాణి పొలం ఏక చెక్కగా తొమ్మిదెకరాలు చేసుకుంటాడు. గుడి ధర్మకర్తృత్వం స్వయంగా చూసుకుంటాడు. మా అన్నయ్యకేం తక్కువే ఒక్క పెళ్ళాం తప్ప. పెద్దలైబ్రరీ పెడతాడట వాళ్ళ వరండాలోనే. శరత్ పుస్తకాలని ఎన్ని వచ్చినవని! నీకు శరత్ సాహిత్యం అంటే బలే యిష్టమని చెప్పాను గూడా" అని భారతి గుక్క తిప్పుకోకుండా మాట్లాడుతూనే వున్నది.

బావా, ఆ చుట్టపబ్బాయి ప్రయాణమై వెళ్ళిన రోజునే ఊళ్ళో పెద్ద దొమ్మి జరిగింది. మేజరు పంచాయతీ గ్రామంలో ఉత్తరంగా శ్మశానం పక్క మైదానంలో డేరా హాలూ, దక్షిణంగా చెరువు ఒడ్డున వక్కా సినిమా మందిరం; లేనిదల్లా గ్రంథాలయం; వున్నవి మూడు హీరో అభిమాన సంఘాలు. జెండా చెట్టు వెనక, లారీలు ఆగే స్థలాన్ననుసరించి కట్టిన పాకలో స్థాపితమైన చిరంజీవి అఖిలాంధ్ర అభిమాన సంఘం-వయసులో చిన్నదైనా సభ్యత్వంలో అగ్రగామి. ఆ పాకలో నిలవెత్తు కటవుట్‌ను క్రిందటి రాత్రి ఎవరు నాశనం చేశారో, పాకకు ఎవరు నిప్పు పెట్టారో—కులయుద్ధానికి నాంది పలికారు.

సినిమా స్టైయిలు ముష్టిఘాతాల్నించి, ఎలక్షన్ స్టైయిలు కర్రల కరాటేకి దిగి, గడ్డివాముల దగ్ధక్రియతో పతాక సన్నివేశానికి ఎదిగి, మానవ హింసతో, ఒక ముదుసలి తల్లి మృతితో దొమ్మి ముగిసింది. రిజర్వు పోలీసు ప్లాటూనుతో, కొత్తగా ఛార్జితీసుకొన్న డిప్యూటీ పోలీసు సూపర్నెంటుతో సంజెచీకట్లో గ్రామమంతా కుతకుతలాడినప్పుడు, ప్రెసిడెంటు బెదిరింపుల్నీ, మాజీ మునసబు రాజకీయాల్నీ ఖాతరు చెయ్యకుండా పోలీసు బలగానికి కోళ్ళ పులావులు అందకుండాజేసి, నిష్పక్షపాతంగా, కులకక్షలు పెంచుతున్న పెద్దల్నీ పిన్నల్నీ అరెస్టుచేసి, సర్కిల్‌తో వాళ్ళందర్నీ ఠాణాకు తరలించి, అరగంటలోనే సర్దుమణిగిన గందరగోళాన్ని సాంఘిక శాస్త్ర వేత్తగా విశదీకరించి, సంఘ ప్రయోజనం లేని యీ సినిమాల అనర్థాల్ని గురించి చర్చిస్తున్న యువ సూపర్నెంటుతో సమాన ఫాయిలో నిలబడ్డ సుందరాన్ని చూపుతూ 'మా అన్నయ్య' అని భారతి సగర్వంగా అన్నప్పుడు, తన భయాన్నంతా అణచుకొని విజయ కూడా ప్రమోదభరితురాలైంది.

కాని, తను ఏ పక్షంలో వున్నది? భారతీ, అనసూ—యీ యుద్ధం యింతలో ముగియదనీ, మాజీ మునసబు పార్టీవాళ్ళు—సుందరం—ఆ ఆకతాయి కుర్రవాళ్ళకు, హామీ నిలిచి, బెయిలు మీద విడిపించినందుకు కక్షకడతారని భవిష్యత్తు చెప్పినప్పుడు—పరితాపమూ చెందింది. ఇంతకీ తన ప్రమోద పరితాపాలకు కారకుడైన ఆ యువకుడు తనకేమీకాడు; మీదుమిక్కిలి తన కుటుంబానికి శత్రువు.

ఈ ఊబిలో ఎందుకు దిగుతున్నది తన మనస్సు? రాజక్క మాటలు విని, హాయిగా హైదరాబాదులో పెళ్ళి తర్వాత కాపురం వుంటే యీ అడుసులో కాలు కూరుకుపోదుగదా. తనకు-కాబోయే అత్తగారికీ ఆడబిడ్డలకూ చూపి ఆమోదం పొందటానికేగదా- అక్క వెనక దిగబడి పోయింది.

ఏమైతేనేం- "వాళ్ళ" యింటి పనులూ ముగిసినాయి, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య స్మారక గ్రంథాలయమూ వెలిసింది. ప్రారంభోత్సవానికి పోలీసు సూపర్నెంటు జోషీ అధ్యక్ష పీఠంలో వున్నాడు. ఎవరో మహారాష్ట్రి అధికారి అనుకొన్న- ఆ జోషీ తెలుగులో తడుముకోకుండా ఉపన్యాసం యిస్తున్నప్పుడు- ఎన్ని కొత్త సంగతులు అవగాహన అయినాయి. ఎన్ని కన్నీళ్ళు వచ్చినాయి?

బారిష్టరీ చదివి, రామదండును నడిపిన ఆంధ్రరత్న, తెల్లదొరలకూ, వాళ్ళ అడుగులకు మడుగులొత్తిన నల్లదొరలకూ సింహస్వప్నమై, తన ఆశుకవితతో, అఖండ పదయాత్రల్తో అనన్య సామాన్యమైన వక్తృత్వంతో ప్రజా చైతన్యాన్ని కొని తెచ్చి- చివరకు క్షయ వ్యాధికి బలియై పోయాడా? ఆయనను తిరిగి స్మరణకు తెచ్చుకొన్న యీ యువకులే ఈ భూమికి నిజమైన వారసులా? ఈ కొత్త శక్తికి సుందరమా ప్రతీక? ఈ యువ శక్తితో మా గ్రామం పురోగమించటం తథ్యమా? నిజమే కాబోలు.

సభకు అన్ని కులాలవాళ్ళు హాజరైనారు. సుందరానికి చేదోడుగా నిలిచారు. దొమ్మి కేసులో మేజిస్ట్రేటు, మంచి ప్రవర్తనకు పూచీ తీసుకొని, గుండె ఆగి గతించిన ముసలి తులిశమ్మ కొడుకుకు మూడువేల పరిహారం యిప్పించి, నిందితులందర్నీ విడిచి పుచ్చాడు గదా. జోషీ సాయంతో, అవగాహనతతో తప్పుడు ఉద్రేకాలకు బలియైన యువతకు నవపథం చూపిన సుందరానికి-యిక యీ ఊళ్ళో బ్రహ్మరథం పట్టరా? ఏమో. మరి జోషీ ఉపన్యాసం అరచేతిలో స్వర్గం చూపించలేదే. ఈ పారిశ్రామిక యుగంలో, ప్రజాస్వామ్య పద్ధతుల్ని ఎన్నుకొన్న భారతదేశంలో, ఏ సమస్యకూ సులభ పరిష్కారం దొరకదు.

అందునా సాంఘిక ఆర్థిక విషయాలు విషవలయంలో చిక్కిపోయి, సంఘ శ్రేయోభిలాషులకన్నా-విద్రోహులకు పూర్ణ స్వేచ్ఛను యిస్తున్నవని సుందరానికి హెచ్చరికగా సూచించాడుగదా. ఈ నెల రోజుల్లో తను ఎంతో ఆలోచంచటానికి, ఆ ఆలోచనల ద్వారా యింకెంతో మానసికంగా ఎదగ టానికి దోహదం చేస్తున్న విశేషాలు-కొన్ని కుటుంబ సంబంధమైనవి, కొన్ని గ్రామీణ సమాజ సంబంధమైనవీ- అనిగూడా అనుకొన్నది విజయ.

ముఖ్యంగా నాన్నగారు ఆవునూ, గేదెనూ దూడల్నీ వాళ్ళ స్థలంలో ఒక రాత్రి కట్టివేసి, జోషీగారు గ్రంథాలయం సమావేశానికి వచ్చి రాగానే మరునాడే ఖాళీ చేశాడు. సుందరం చుట్టూ తిరుగుతున్న కుర్రకారు చాలా మంది గుంపుగా ఆ స్థలాన్ని వచ్చి చూసి, కొద్ది కొద్ది మాటల్నుండి పెద్ద పెద్ద కేకలకు దిగటంతో సుందరం స్వయంగా వచ్చి సర్ది చెప్పటమేగాకుండా, తమ యింటిదాకా నడిచి నాన్నగారు కనిపించక తనతోనే అన్నాడు :

"నాన్నగారికి చెప్పు విజయా. ఆ స్థలం ఖాళీగానే వుంది. మీరు నిర భ్యంతరంగా గొడ్లను కట్టేసుకోవచ్చు"

అని మళ్ళీ వెనుదిరిగి- "లైబ్రరీ పుస్తకాలు నువ్వే వచ్చి సెలెక్టు చేసుకోవచ్చు గదా, మధ్య భారతెందుకు? గురు, శుక్ర వారాల్లో ప్రత్యేకంగా ఆడవాళ్ళకే లైబ్రరీ. ఆ వారాల్లోనే పాటల రికార్డింగూ వుంటుంది. నీకిష్టమైతే సంగీత దర్శకత్వమూ చేబట్టవచ్చు"- నిర్మలంగా నవ్వుతూ వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి యింట్లో పెద్ద గొడవ జరిగింది. నాన్నగారు తను తెచ్చు కొన్న లైబ్రరీ పుస్తకాల్ని విసిరి డొడ్లోకి గిరాటు వేశాడు. మర్నాడే అక్క య్యతో తన ప్రయాణం నిశ్చయించారు. తనెన్నడూ విని ఎరగని తిట్లు, ఊహించని అసహ్యపు చూపులు, స్త్రీ జన్మను గురించిన సిసలైన సత్యాలు- నిదురరాక, వేగుచుక్క పొడిచినదాకా మెళుకువతోనే నిశ్శబ్దంగా దుఃఖి స్తుంటే, తను ఫిడేలు వాయించిన భారతి పాట ఉదయపు తన ప్రయాణానికి వీడ్కోలు గానంగా, సుందరంగారి డాబా యింటినుండి వినిపిస్తున్నది. భారతీ, అనసు కనబడతారేమోనని తన ఎదురుచూపులు, చెలిమినీ, కలిమినీ పంచి యిచ్చిన చెట్లు మాత్రమే గ్రహించిన చివరి చూపులా?

* * *

తను వచ్చి నాలుగు రోజులైనా కాబోయే అత్తగారుగాని ఆడబిడ్డలు గాని వచ్చి పలకరించనేలేదు. బావా, అక్కా గుసగుసల్లో తన స్థానం ఏమిటో?

వారం దాటిన తర్వాత అక్క తననే వాళ్ళింటికి ప్రయాణం చేయించింది. తన్నావరించిన ఒక నిర్వేద భావంతో, ఎవరి కోసమూ నిరీక్షించకనే ఆకాశంలో యుగ యుగాలనుండీ నిలిచిన ఒంటరి నక్షత్రంలాగా అక్కవెంట పోయి, ఇంకెవరి బ్రతుకులోనో పాలుపంచుకొనేందుకై భిక్షాటనకై బయలుదేరిన కాందిశీకురాలుగా- తన కాబోయే అత్తగారి యింట్లో మొదటి నాగరిక సంభాషణలు విన్నది :

"రెండొందల రూపాయలకు తక్కువైతే ఆ చీరె కట్టను వదినా" కాబోయే పెద్దాడపడుచు.

"మొత్తం వంద క్యాసెట్లు త్రీ-యిన్-వన్ జపానుది"

"వంశీ. నీవింకా గిటార్ ప్రాక్టీసుకు పోవా ఏమిటి?"

"ఇవ్వాళ శ్రీదేవి బర్త్‌డే. మెడ్రాసుకూ బాంబేకు గ్రీటింగ్స్ పంపించాలే" కాబోయే మరిది మాటలు.

తనకు తగలాలనీ, తగిలి మూర్ఛపోవాలనీ వదులుతున్న ఈ ఆధునిక శర పరంపరలన్నీ గురి తప్పిపోతున్నా, వాళ్ళ అల్పానందాన్ని బతికి నన్నాళ్ళూ పంచుకోటానికేనా తనిక్కడికి కోరి వచ్చింది? పంజరంలో పక్షికి మాటలు పడిపోయినట్లుగా ఖిన్నురాలై తలవంచుకు కూర్చున్నది. కాని రెండు వేళ్ళు నోట్లోకి పోయే యీ కొద్ది ఐశ్వర్యంతోనే ఆ యింటి కూతుళ్ళూ, చిన్న కొడుకూ అలవరించుకొన్న పెద్ద నగరపు అలవాట్లూ, సినిమా మాటల అనుకరణాలూ - అన్నీ కలిపి త్రాసులో ఒక పడిలో వేస్తే, వాటన్నిటినీ మించిన బరువుగల పెద్ద మాటను కాబోయే అత్తగారు రెండవ పడిలో వేసింది.

"ఇంతకీ మీ నాన్నగారి ఆస్తిపాస్తుల వ్యవహారం మామయ్యకు తెలీనే తెలియదు రాజేశ్వరీ. ఆ కోర్టు విషయాలన్నీ తేలితే మీ అక్క చెల్లెళ్ళకు చెరో నాలుగెకరాలకన్నా మిగులుతాయిటే?"

అక్క కొంచెం తడబడి సర్దుకొని-"నాకూ వివరంగా తెలీదు అత్తయ్యా. మేమిద్దరమేగా. వున్నదేదో మాకే వస్తుంది" అనగలిగింది. మరేం చేయగలుగుతుంది - తమ ఊళ్ళో తన ఆత్మ విశ్వాసపు మాటలకూ. యిక్కడి వాస్తవ మానసిక రుగ్మతలకు అంత అంతరం వున్నపుడు?

"ఏమోనే రాజేశ్వరీ, ఇంట్లో అందరికీ బ్యాంకి ఉద్యోగం చేస్తున్న పిల్లయితే మంచిదంటున్నారు. మీ మామయ్యకైతే ఉద్యోగంచేసే పిల్లంటే అసలు కిట్టదు"

అక్క తనం ముఖం చూడలేక, "వెళ్ళొస్తాం అత్తయ్యా" అంటూ లేచింది. కాని సాయంత్రం ఆ పిల్లవాడు వచ్చి తనను సినిమాకు తీసికెళ్తానని అడిగినప్పుడు, చాటంత ముఖం చేసుకొని "అంత సరదాపడి పిలుస్తుంటే ఏమిటే ఆ మంకుపట్టు?" అని తననే తప్పు పట్టింది. తగూ తీరుస్తూ బావగారు కూడా "నేనూ వస్తాను పదమ్మా" అని దారి తీసినప్పుడు, గత్యంతరంలేక బయలుదేరింది.

తీరా, సినిమా హాలు అవరణలో క్రిక్కిరిసిన జనాన్ని తోసుకుంటూ బుకింగ్ ముందు నిలబడితే, బ్లాకులో టిక్కెట్లు అమ్ముతున్న రౌడీలను, జనాన్నీ విచక్షణ లేకుండా పోలీసులు లాఠీలతో మోదుతుంటే తప్పించుక బయటపడి, మొదటి సీను నుంచి చివరి సీనుదాకా తుపాకుల్తో కాల్చి హత్యా కాండను విపులంగా చూపిన వేరొక ఇంగ్లీషు సినిమా చూసి, ఆటోలు దొరకక' అర్ధ రాత్రికి యింటికి చేరి మజ్జిగ నీళ్ళు తాగి పడుకొని ఆత్మస్థయిర్యమూ, నిర్భీతీ సుఖమూ లేని యీ నవనాగరికతనా తను వరించబోతున్నది అని విస్తుపోయింది.

తన త్యాగరాజ కీర్తనలకు, సంపెంగి పందిళ్ళకు యిక్కడ తావులేదు. నిండుగా ధోవతి, లాల్చీ, అంచు ఉత్తరీయాలు ధరించే మనుషులూ యిక్కడ లేరుగదా. వీళ్ళు నాగరికత వేళ్ళు తన ఊళ్ళో వృక్ష సముదాయం నుంచి ఉద్భవించినవిగావు. అహంతలో ఆనందం దర్శించేవాళ్ళకూ, ప్రశాంతిలో ప్రకృతిలో తెలియకుండానే తాదాత్మ్యం పొందేవాళ్ళకు మధ్యన పొంతన ఎక్కడ?

ఈ నెల రోజులూ వార్తాపత్రికలు తుదిదాకా చదువుతూ అలజడులూ, ఆందోళనలు, వైరుధ్యాలు, విరోధాలు మానవుడి జీవితపు పరమార్థాలుగా మారిన యీ లోకంనుండి భారతి ఉత్తరం తనను మేల్కొలిపింది.

రాజకీయ శాస్త్రంలో పోస్టుగ్రాడ్యుయేషన్ చేసి, యిప్పుడు ఆర్థిక శాస్త్రం చేపట్టి - యింకా తన చదువు కొనసాగిస్తున్న భారతి జాబు నిశితం గానూ వుంది, నిర్మలంగానూ వుంది. మాటలెంత నిర్మొగమాటమో, వ్రాతలు గూడా, హైదరాబాదు జనారణ్యంలో దారితప్పిన తనకు దిశాసూచకంగా వుంటంలో ఆశ్చర్యమేముంది?

"నువ్వు చెప్పకుండా వెళ్ళినందుకు - మొదట ఆగ్రహం కాదు కలి గింది - షాక్! తర్వాత పరిస్థితులు అర్థమై కన్నీళ్ళు! ఈ నాలుగైదు నెలలూ

నిన్ను మరిచిపోయా మనుకొంటున్నావేమో. పుష్ప సౌరభాన్ని, చిరుగాలి మోసుకొచ్చినప్పుడు—ముక్కులు మూసుకొంటారా మనుషులు? స్నేహసౌరభం గూడా అట్లాంటిదేగదా.

అయితే మాకొక్కటే విచారం. మాతోపాటు మన ఊళ్ళో నిర్మితమవు తున్న కొత్త చరిత్రను దగ్గిరే వుండి ప్రత్యక్షంగా వీక్షించే అదృష్టం పోగొట్టు కున్నావనే.

ముఖ్యంగా చెప్పవలసింది—మన ఊరికీ, చుట్టుపక్కల ఊళ్ళకీ ముక్కు గున్నయ్య ప్రైవేటు బస్సుల గొడవ పెండింగు కేసు—తెగిపోయింది. ఓనరూ, ఆయన కోడలూ స్నాన పానాదులు ముగించుకొని ముస్తాబయిందాకా, బస్సుతో పాటు వాళ్ళింటి ముందు గంటలు గంటలు పడిగాపులు కాయటం—మనస్మూ_లు రోజుల్నుంచి అనుభవించిన పెత్తందారీ అహాయిత్యం అంతమైంది. కార్పొ రేషన్ బస్సులొచ్చినై. మన ఊళ్ళో చిన్న డిపో పెడతారేమో గూడా.

రాజాలు మొగుడికి యీమధ్య పెద్ద జబ్బు చేసింది. చాలా నోములు నోయించారు. నీ మొగుడికి నయమైతే- అనే ప్రశ్నేలేదు. వచ్చేవారం లేచి తిరుగుతాడు - అని రోజూ మేం ధైర్యరసం నూరిపోశాం. మాట తప్పకుండా, రాజాలు పెద్ద ఆల్మారాలు - కొయ్యవే రెండు చేయించి మన లైబ్రరీకి బహూకరించింది. పిచ్చివీ ఎచ్చివీ మంచివీ అన్నీ కలిపి యిప్పుడు సుందరం అన్నయ్య పుణ్యమా అని రెండు వేల పుస్తకాలు పోగుబడ్డై.

ముగ్గురు హీరోల అభిమాన సంఘాలూ రద్దయిపోయినవి. ఆ డబ్బూ, చందాలు పోగుజేసింది అంతా జమనేసి - అన్నయ్య సుందరం యిప్పుడు ఒక చిన్న ఫిలిం సొసైటీ ఏర్పాటు చేశాడు. వింటమేగాని, సత్యజిత్ రే చిత్రాలు - సొసైటీవాళ్ళు పట్టుపట్టి టెంపరరీ హాల్లోనే వేయించారు.

పథేర్ పాంచాలీ, అపూర్ సంసార్, అయితే చాలామందికి అర్థంకాలేదు. డిషూం డిషూంలు - అన్ని వందలు చూచాక కొంచెం తికమకపడ్డారుగదా. కాని చిత్రం అయాక అవి తెచ్చిన పెద్దమనిషి చిన్న లెక్చరిచ్చాడు. వారం వారం - ఒక రోజు కొత్త పిక్చర్లు తెస్తున్నారు. అంకుర్ - అని శ్యాంబెనిగల్ తీసిందాన్ని - అందరూ మెచ్చుకొన్నారు.

పిక్చరు తర్వాత లెక్చెరు. ఎవరూ దొరక్కపోతే మా సుందరం అన్నయ్య విడమరిచి చెబుతెన్నాడు. బి. నర్సింగరావు చిత్రాలు మా భూమి, రంగుల కల చూట్టానికి ఫిలిం సొసైటీ సభ్యులే కాకుండా, చాలామంది ప్రేక్ష

కులు వచ్చారు. ప్రస్తుతం కాశీనాధుని విశ్వనాథ్ పిక్చర్లు మొదలు పెట్టారు. వారానికొకటి. సొసైటీకి చందా నెలకు రూపాయి. ఇంకా ఖర్చు తగిలితే గుప్త దాతలు పెట్టుకొంటున్నారు.

మన లైబ్రరీలో - నిన్న మధ్యాహ్నం కవి సమ్మేళనం లాంటిది జరిగింది. మన హైస్కూలు తెలుగు మాష్టారు శుద్ధగ్రాంథికంలో ప్రబంధాల మీద మాట్లాడి కొంచెం విసుగు కలిగించినా, పద్యాలు చదవటం బహుకర్ణపేయంగా ముగిసింది.

తర్వాత జోషీగారు, ప్రబంధ యుగం ముగిసింతర్వాత తిరుగుబాటుగా వచ్చిన కాల్పనిక సాహిత్య యుగం, తర్వాత భావకవిత్వం నుండి ఊహాప్రేయసుల వేడి నిట్టూర్పుల నుండి తప్పించుకొని ఆధునిక యుగంలో అడుగు బెట్టించిన గురజాడ వారిని గురించి చాలా విపులంగా, విస్పష్టంగా మాట్లాడారు. పోలీసు ఉద్యోగి! ఆయనకు అభ్యుదయ కవులు, దిగంబర కవులు, విప్లవ కవులు, మినీ కవులు, మార్జికవులు - వీళ్ళ కవితల్లో అంతరాంతరాలు, వస్తు విభేదాలు, మాత్రా ఛందస్సులు - అన్నీ నల్లేరుమీది బండి నడక.

ఇది కల్చరల్ ఫ్రంట్! మన ఊళ్ళో నడుస్తూన్న సమకాలీన సాహిత్య స్పందన విప్లవం!!

అయితే, కవిత్వంతో కడుపు నిండదుగదా అందరికీ. ఏయే గ్రామీణ పరిశ్రమలు ప్రారంభిస్తే నిరుద్యోగులకు ఉపాధి కలుగుతుంది?- అని సుందరం అన్నయ్య - ఊళ్ళో తనకు తీరిక దొరికినప్పుడల్లా చర్చలు పెడుతున్నాడు. జాతీయ బ్యాంకువారు, గ్రామీణ బ్యాంకువారు - ముందుకు రావటం తర్వాతి సంగతి. ఓం ప్రథమంగా గ్రామంలోనే, ఉట్టి ముంతల్లో, బియ్యం బస్తాల్లో, చూర్లల్లో, యినప భోషాణాల్లో దాగివున్న మూలధనాన్ని బైటికి లాగిస్తున్నాడు,

మన చుట్టుపక్కల వున్న మూడు నాలుగు బస్తీ పట్నాలకు ఐస్ సప్లై చేసే చిన్న ఫాక్టరీకి, వెంకటరత్నంగారి దొడ్లో పని ప్రారంభించారు. తమల పాకుల తోటలకు బుట్టలుసప్లై అల్లుకుపోయి దాదాపు పది పేద కుటుంబాలకు కొంత ఆధరువు ఏర్పడుతున్నది. మన ఊరి బుట్టలు నాగపూర్, కలకత్తా పోతున్నయ్యంటే గమ్మత్తుగాలేదూ? ఓంకారం, శామన్న-యిద్దరూ ఒక అర డజను పనివాళ్ళతో కలిసి, ఫాన్సీ ఫర్నీచరు తయారుచేసి గుంటూరు పట్నానికి పంపిస్తున్నారు. హాట్ హాట్ కేక్స్ అనుకో.

హీరో అభిమాన సంఘాన్ని రద్దు చేసుకొన్న-రికామీ పార్టీకి యిప్పుడు ట్రాక్టరు రిపేరీ తర్ఫీదు యిప్పిస్తున్నారు. ఊళ్ళో పండే కూరలు ఎప్పటి

కష్టుడు తాజాగా ఉత్తర దక్షిణ మార్కెట్లు చేరవేసే చిన్న వ్యాన్‌ను ధన వంతుడు బుచ్చయ్యగారి చేత కొనిపించారు. కూరగాయల సీజను అయిపోక ముందే, దాన్ని పాలకేంద్రంవాళ్ళు బాడుగ మాట్లాడు కొన్నారు. ఇప్పుడు టొమాటో సాస్, కెచప్, సీసాల్లో ఎగుమతిచేసే పరిశ్రమ యంత్రాల మీద చూపు విసిరారు. దీనికి గ్రామీణ బ్యాంక్‌వాళ్ళు తల ఊపినట్లే.

ఇట్లా వర్ణించానని అంతా సజావుగానే వుందనుకోకు. ప్రభుత్వ సారాయి దుకాణపు రద్దీ చాలా కొద్దిగానే తగ్గిందిట. అయితే దొంగ బట్టీ సారాయి ప్రవాహ వేగం మాత్రం వెనుదిరిగింది. చాకలి రత్తాలును మొగుడు తాగి వచ్చి రోజూ కొట్టటం, శోకాలూ నడుస్తూనే వున్నాయి.

కాని వాణ్ణి సుందరం అన్నయ్య స్నేహితులు యీ మాటు వార్నింగుల్తో విడిచి పెట్టదలచుకోలేదు. దిక్కులేని బాల వితంతువులు-వీరమణి శాయమ్మల గల్లీలో తాగుబోతు వీరాభిమన్యుల ప్రేలాపన కట్టుబడిపోయింది. దేహశుద్ధి చేయకుండానే, పదునైన కత్తిగాట్లు కంటే గాఢమైన మాటల్తో మనిషికి బుద్ధి చెప్పటం ఎట్లాగో సుందరం అన్నయ్య యువ సైన్యానికి నేర్పాడు.

ఇప్పుడు ఆ మాజీ వీరశిఖామణుల్లో ఒకడు, శాయమ్మను వితంతు వివాహం చేసుకొంటానని అన్నయ్య చుట్టూ తిరుగుతున్నాడు. ఏమీ నిర్ధారణ కాలేదు. ఎందుకంటే శాయమ్మ భయం పూర్తిగా తొలగలేదు.

మా సుందరాన్ని మకుటంలేని యువరాజుగా వర్ణించానేమో. పాతకౌలు పొడిగించకుండా దేవుడి మాన్యాన్ని అన్నయ్య స్వాధీనపరచుకొనే సమయంలో, మునసబుగారి ముఠా, దాదాపు దొమ్మీ పరిస్థితుల్ని తెచ్చింది. సాలు కౌలు ఎకరాకి వంద రూపాయలు దేవుడికీ, వెయ్యిదాకా స్వభుక్తానికి. లెక్కలు చూపించాడు. మున్సబు కొడుకే తండ్రికి ఎదురుతిరిగాడు. కులపిచ్చిని, ఉన్మాదంగా మార్చిన వాళ్ళకు యింకో సంవత్సరంలో పెత్తనం వుండబోదని కుర్రకారు నిరూపించారు.

ఈ ఏటి ఆదాయంతో దసరా ఉత్సవాలు వేరొక పద్ధతిలో నిర్వర్తించే కమిటీని వేశారు. మల్లగుల్లాలు పడ్తున్నారు. మన జిల్లాలోని జానపద కళా కారుల ఉత్సవాలు పదిరోజులు జరగటం మాత్రం తథ్యం. అయితే, ఎవరింటి ముందు ప్రథమంగా ఆగాలి అని పెత్తందార్లూ కులాలవారూ, స్థంభింపజేసిన రథోత్సవం యీసారి కొత్త బాటలో నడుస్తుందిట.

మొదట ఆగేది పంచాయతీ భవనం ముందు. తర్వాత మన లైబ్రరీ ముందు! వచ్చే ఎన్నికల్లో పంచాయితీని నడపాల్సింది స్త్రీ లేనని- యువ సైన్యం తీర్మానించింది. దాని మాటలకు తిరుగులేదు. వేరొక ఆకాశం, వేరెన్నో కొత్త నక్షత్రాలూ! మన ఊళ్ళో రాత్రిళ్ళు చూస్తున్నాం"

* * *

అక్క వచ్చి పలకరించిందిదాకా విజయకు తను నిశ్శబ్దంగా దుఃఖిస్తున్నట్లు తెలియలేదు.

"ఏమిటే"?

"ఏమీలేదు. భారతి ఉత్తరం"- అన్నది తను.

ఆ సాయంత్రం తన "కాబోయే అత్తయ్యగారిం"టికి వెళ్ళి వస్తానంటే రాజక్క చాలా సంతోషించింది. కాని తీరా ఆమెను కలుసుకొని- "మీ అబ్బాయికి బ్యాంకు ఉద్యోగం వున్న పిల్లను చేస్తేనే మంచిదత్తయ్యా"- అని ఉచిత సలహా పారవేసి వచ్చిందని తెలిస్తే ఏం చేసేదో.

* * *

బావగారు ఆఫీసు నుంచి రాగానే, అక్కను ముందుంచుకొనే- "రేపు నన్ను బస్సెక్కించు బావా" అని అడిగింది. తను ప్రకృతి బిడ్డననీ, చెట్లు, పూలూ తన స్వాభావిక స్నేహితురాలనీ, తనకి జైలు వాతావరణం వడలేదనీ చెప్పటం చేతగాక బస్సు ప్రయాణం అన్నదని వాళ్ళెట్లా గ్రహిస్తారు?

"ఏం తొందరమ్మా?"

నేను ఆవలి పక్షంలో జేరిపోతున్నాను బావా, యిక నన్నాపినా వుండను" అన్నది తను.

○

స్వాతి మాసపత్రిక
జూలై 90

# కుటుంబ గౌరవం

పడమటింటి చీకటిని దూసుకుంటూ, పై కప్పు పాత పెంకుల్లో యిరికివున్న గాజు పలక ద్వారా వెలుతురు పడుతున్నది - పేడతో అలికిన నేలమీద.

మండిగంమీద చతికిలబడి కూచున్న కొడుకు ఆ కాంతి పుంజంవంక క్షణం చూస్తూ, మరో క్షణం విస్తరి ముందున్న తల్లిని పలకరించాలని పావు గంటగా ప్రయత్నిస్తూనే వున్నాడు

"అమ్మా!" ఆమె వంచిన తల ఎత్తలేదు.

అతను గడపమీదనే ఒక వైపునుంచి యింకొక వైపుకు జరిగి కూర్చొన్నాడు. విస్తరి ముందున్న తల్లి ఆ మూగ వెలుగు గూడా విస్తరిమీద పడకుండా మోచేతిని క్రీనీడగా పెట్టింది. కొడుకు మళ్ళీ సంబోధించాడు.

"అమ్మా!"

ఆమె యీసారి తలెత్తి గడపవేపు చూసింది. అదే ఆమె సమాధానం. తల్లి కొడుకులమధ్య కప్పునూ నేలనూ కలుపుతున్న వెలుతురు స్థంభం అడ్డుగా వున్నది.

"అమ్మా! నువ్వేం తింటున్నావో నాకు తెలుసు. కుండలో ఉప్పు గోంగూరతో రెండు ముద్దలు తిన్నావు. ఇప్పుడు ఉప్పుకల్లు, వేన్నీళ్ళు కలుపుకొని నూకలన్నం తింటున్నావు. అంతే గదమ్మా?"

ఆ ప్రతి అక్షరం వెనుక ఏమి బరువున్నదో, ఎంత నిస్పృహ వున్నదో- అంత బరువుతోనూ, అంత నిస్పృహతోనూ ఆమె విస్తరి మడిచివేసింది.

"నాన్నా! నీ చదువు వదలి నువ్వెందు కొచ్చినట్లు చెప్పు? నేను రమ్మని రాశానా? ఈ తిండి కేం కొత్త గాదు. మీ నాన్నగారు పోయిన మరు సంవత్సరంనుంచి మనం మనుషుల తిండి మర్చిపోయాం గదా."

"అవును. అవునమ్మా, నేను వచ్చినందుకా నీ వేదన? నే నిం కెప్పుడు రావాలి? ఈ వుప్పు గోంగూర మెతుకులు గూడా, మన నీడన మనం కూర్చొని యిక తినే ఆస్కారం లేదుగా అమ్మా. ఇక యీ యిల్లు గూడా వేలం వేశారు. కొండయ్య కొనేశాడు. నువ్వు రేపట్నుంచీ సత్రం ముందు, చెట్ల క్రింద చేరాలి. ఇక యిప్పుడు గూడా నేను చూడనట్లే నటించనా అమ్మా?"

ఇన్నాళ్ళూ పసివాడనుకొన్న తన కొడుకును కొత్త రూపంలో తల్లి చూచింది. తండ్రివలె పొడగరి. తండ్రివలె నిశితంగా తెలివిగా చూచే కళ్ళు. ఎన్నో తరాలుగా, అన్ని వారసత్వపు హయాములలోనూ ఏక వాహినిగా పారిన ఆ కుటుంబ గర్వం, గౌరవం, గణనం - తన భర్తతోనే తీరిపోయిం దనుకొన్న ధిక్కార లక్షణం - వీటన్నిటికీ మూర్తిగా నిలబడివున్న కొడుకును మరోమారు సూటిగా చూచింది.

"కొండయ్య తప్పేముంది నాన్నా! మీ నాన్నకు తలకు మించిన అప్పులు చెయ్యమని చెప్పాడా? ఇల్లు తాకట్టు పెట్టి, యిల్లాలుకు మాటైనా చెప్పవద్దని బోధించాడా? కోర్టులో డిక్రీలు అయినాక యిక వేలం ఆగుతుందా? కొండయ్య కాకపోతే యింకొకళ్ళు కొనేసేవాళ్ళు."

"ఎవ్వరూ కొనరు. నాన్నమీది గౌరవంచేత మూడుసార్లు వేలానికి వచ్చినా యీ యింటి దీపం తీసెయ్యటానికి వూరివాళ్ళు ముందుకు రాలేదు. ఈసారి కొండయ్య నేనున్నానని వచ్చాడు. అమ్మా, యీ కొండయ్యను నే నెప్పుడూ మర్చిపోను. నువ్వు చెప్పగా అనేకసార్లు విన్నా - అప్పుడు - వెన కటి రోజుల్లో - పార్టీలు పడి దొమ్మీలు జరిగినప్పుడు - నాన్న యీ కొండయ్యనే అటకమీద దాచి ప్రాణదానం చేశాడు. ఆ యింటి వాసాల్నే లెక్కబెట్టాడు. ఆ తండ్రి బిడ్డకే యిల్లు లేకుండా చేశాడు."

కొడుకు మాటల పొందికలో క్రోధానలం రాజుకొని రాజుకొని వ్యాపిస్తు న్నది. ప్రజ్వలిస్తున్నది. గడచిన పీడ కల అనుకొన్న - తన భర్త పార్టీ తగాదాలు, గ్రామ కలహాలు - యింకొక రూపంలో తన కొడుకు చుట్టూ ఆమెకు కన్పించినవి.

"నాన్నా - నువ్వు చదువుకొంటే నా కష్టాలన్నీ తీరినట్టే. ఎవరినని ఏం లాభం? మన కర్మకు ఎవరు కర్తలు నాన్నా. నువ్వు కాలేజీ వదిలి వచ్చే శావు. వచ్చే నెలేగా పరీక్షలు-! నా తిప్పలు నేను పడతా. నువ్వు పో బాబూ. మామయ్యకు గూడా విశేషంగా ఏమీ చెప్పకు - పో నాన్నా."

"అందుకు కాదమ్మా నేను నీ కడుపున బుట్టింది. నువ్వు దిక్కు-తేని దానివై సత్రం అరుగులమీద నడుం వాల్చి కన్నీరు కారుస్తుంటే, నేను మామయ్యగారింట్లో ఏమీ వట్టనట్టు సుష్టుగా తింటూ, ఆ పోకిరీ వెధవల్లాగా కాలేజీలో ఆడపిల్లల్ని ఏడిపిస్తూ తిరగలేనమ్మా. యీ యిల్లు మనది. యీ యిల్లు తిరిగి మనదయిందాకా నే నీ వూరు కదలను. కొండయ్యగాదు - ఎవరూ యీ యిల్లు నాది కాదనలేరు."

"మీ నాన్నే అన్నాడు-! యీ యిల్లు మనదే అయితే అప్పులూ, తాకట్లూ వుండేవి గాదు. మనకు ప్రాప్తం లేదు."

కొడుకు మళ్ళీ తల్లి వంక నిదానంగా చూశాడు. తన ఆవేశాన్ని దాచి పెట్టాలని నరాలను బిగబట్టి నిలుచున్నాడు. కాని గొంతు పెగిలి రాలేదు. అది రుద్ధమై పోయింది.

"ఆ - మ్మా -!"

ఆ పిలుపూ, ఆ తరువాతి నిశ్శబ్ధమూ ఆమెకు భరింపరానివి. కలచి వేస్తున్న హృదయాన్ని, ఒలికి పోబోతున్న కన్నీటిని, దశాబ్దాల దుఃఖ భారంతో అలవడిన ఓర్పుతో, మొండి ధైర్యంతో ఆమె ఆపుకొన్నది.

"నా తండ్రివి కదూ, నీ చదువు పాడై పోతుంది. ఈ పూట బస్సులో బయలు దేరితే రాత్రికి చేరుతావు. ఈ నాలుగు సామాన్లు నేనే చేరవేసు కొంటాను. నేను సత్రం నీడలో వుండక్కర్లేదు బాబూ. భద్రమ్మ పిన్ని ముసలిదై పోయింది. నన్ను తోడుగా వచ్చి వుండమంటున్నది."

"నిన్ను తోడుబెట్టుకొని మామయ్య తీసుకు రమ్మన్నాడమ్మా. నాలుగు బస్తాల ధాన్యంతో సంవత్సరం బతుకుతా నంటావ్, ఎట్లా నమ్మా?"

"నీకు తెలియదు బాబూ, నా ఘటం ఈ గడ్డ మీద తెల్లారవలసిందే, నే నెక్కడికీ రాను. పోను. నా తరవాత తల్లి వంటివాడు, నీ తండ్రి తర్వాత తండ్రి వంటివాడు మామయ్య నీ భారం నెత్తినేసుకొని చదివిస్తానన్నాడు. ఇక నాకు దిగులెందుకు? నా జానెడు పొట్ట నిండకపోతుందా?"

"అయితే నే నిక చదవను."

ఆమె ఛ్రరుమని లేచింది.

"నిన్ను నమ్ముకొన్నారు. మనం గర్భ దరిద్రులమైనా లక్ష్మిని నీ కిచ్చి చేద్దామని మామయ్య కలలు గంటున్నాడు. నమ్మినవాళ్ళని చెరుస్తావా? మన యింటా వంటా లేని అపవాదు తెస్తావా?"

పాత కాలాలనాటి యిల్లు ; పిత్రార్జితమైన యిల్లు ; నాలుగు తరాలుగా ఆ కుటుంబపు సుఖదుఃఖాల నన్నింటినీ తన నిండు హృదిలో దాచి, యజమానులతోపాటు అన్ని అనుభూతులకూ లోనై, పాలు పంచుకొన్న ఆ యిల్లు—యీ తరంలో కొత్త కుటుంబానికి పోయింది. కొత్త యజమాని వచ్చి బూజు దులిపించి, యిక్కడా అక్కడా మరామత్తులు చేసి, సున్నం కొట్టించి కొత్త దీపం వెలిగించాడు.

ఇల్లు ఖాళీచేసి, భద్రమ్మ జేజి గారింట్లో తల దాచుకొంటూన్న యీ వారం రోజుల్లోనూ తల్లీకొడుకూ ఒక్కసారి గూడా మాట్లాడుకోలేదు. అతను వూళ్లో పెద్ద మనుషుల చుట్టూ కాలికి బలపం గట్టుకు తిరిగాడు.

"మా నాన్న మీ పార్టీవాడు. కొండయ్య ఎదిరి పార్టీవాడు. మా కన్యాయం చేస్తుంటే చూస్తూ వూరుకొంటారా?" అని రెట్టించి అడిగాడు.

"ఇందులో న్యాయా న్యాయా లేమీ లేవయ్యా. వేలానికి సొత్తు కొనుక్కొన్నాడు. పార్టీలంటావా? కొండయ్య జోలికి పోయే పార్టీలు పోయినై గా, ఇప్పుడాయనగార్ని కదిలించాలంటే రెండు "ల" కారాలుండాలి"అన్నారు వెలిగి ఆరిపోయిన పార్టీ పెద్దలు.

"ఆహా, అట్లాగా—" అని తల వూపి యింటికి వచ్చేశాడు.

ఆ సాయంత్రమే మామయ్య వచ్చి తనతో తీసుకుపోయాడు మేనల్లుణ్ణి.

* * *

కోర్టునుంచి సమన్లూ, లాయరునుంచి రిజిస్టర్డు పోస్టులో నోటీసులూ వచ్చిందాకా భాగ్యమ్మ కొడుకు విశ్వం—ప్లీడరీ చదివి బోర్డు కట్టినట్టుగా, కొండయ్యకు తెలియదు. భాగ్యమ్మ కనబడుతున్నా, ఆమె నెప్పుడూ పలకరించి ఎరగడు. గత అయిదారేళ్ళ నుంచీ విశ్వం ఆ వూరు పొలిమేరలు తొక్కలేదు. భాగ్యభోగ్యాలు లేనివాళ్ళ సంగతులు ఏ చరిత్రలోకెక్కుతై? కొండయ్య, ముఖం మట మట లాడించకుండానే సమన్లు అందుకొని అన్సర్లు వ్రాయించటానికి తన పాత లాయరుకు అందజేశాడు—చిరునవ్వు నిర్లక్ష్యం చిందిస్తూ.

కొండయ్య చిరునవ్వు ఎన్నో రోజులు నాట్యం చెయ్యలేదు. నిర్లక్ష్యం నిలవుండలేదు. ఒక వ్యాజ్యం పోతే, యింతో దానికి అప్పీళ్ళ మీద సమన్లు, తప్పీళు. యుద్ధం రోజులనుంచీ స్వరాజ్యం దాకా కొండయ్య ఆర్జించిన విత్తం, విడ్డూరం, కాలం, కనకం—కనబడని కోర్టు కయ్యాలకు కర్పూరం కొండ కరిగి తరిగినట్లుగా కనబడకుండా పోతోన్నది. అన్ని కయ్యాల్లోనూ ప్రతి కక్షి—భాగ్యమ్మ బిడ్డ—లాయరు విశ్వనారాయణ.

వూరివాళ్ళంతా, "పోయి భాగ్యమ్మ కాళ్ళు పట్టుకోమన్నారు" కొండయ్యను. కలంపోటు లేకపోయినా కనకాభిషిక్తుడైన కొండయ్య—ఎదుగూ తరుగూ లేని ముసలి వవుతున్న భాగ్యమ్మకు ఆశ్రయం యిచ్చిన భద్రమ్మ యిల్లు వెతుక్కుంటూ పోయాడు.

"భాగ్యమ్మగారూ, చూశావా యీ అన్యాయం? పద్దయ్యగారి హయాంలో నాకు ప్రాణం దానం చేశారు. అన్నపూర్ణ తల్లివి—మీ యింట్లో మూడు రోజులు దాచి, బిడ్డను చూసినట్లు చూశావు. ఒక్క మాట చాలమ్మా. ఒక్క మాట——"

భాగ్యమ్మ ఆ ఖిన్న ముఖాన్ని క్షణంకంటే పరికించ లేకపోయింది.

"ఏడీ, నా కొడుకు? ఏడీ?" అని అడిగింది.

కొండయ్య కేమీ అర్థం కాలేదు. వూరివాళ్లు చెప్పమన్న విజ్ఞాపన అంద జేసుకొన్నాడు.

"తల్లీ—మీ యింటిని ఖాళీచేసి యీ క్షణం పొమ్మన్నా పోతాను. సన్నిక కోర్టులపాలు చేయొద్దని చెప్పమ్మా. నీ కడుపున పుడతాను"

భాగ్యమ్మ, మసక చీకట్లో నుంచొన్న కొండయ్యను మళ్ళీ ప్రశ్నించింది.

"ఏడీ నా కొడుకు? ఏడీ?"

ఇంకో పది నెలల్లోనే కంట్రాక్టరు కొండయ్య కుప్పగా, చప్పగా కూల బడిపోయాడు. చీకటి కమ్ముకొచ్చి ప్రళయం ముంచెత్తినట్లు—అప్పులు, నష్టాలు, ప్లీడరు బిల్లులు, ప్లీడరు గుమాస్తాల అపశకునం అవమానపు మాటలు, వేలాలు, వియ్యాల తగాదాలు—అన్ని వేపులనుంచీ కట కటాలు కదుల్చు కుంటూ కూలబడి వున్నవాణ్ణి కట్టివేసినై.

అతనికీ కోర్టులకూ చిట్టచివరి సంబంధం—యిల్లు వేలంవేసిన రోజున. ఆ గ్రామానికి వలెనే వృద్ధురాలైన ఆ యిల్లు మరమ్మత్తులు లేక పెళ్ళ పెళ్ళలుగా వూడిపడుతున్న ప్రహరీ గోడవలె, పతనమైన అతని ఫ్యూడల్ సామ్రాజ్యం—ఎవరినీ ఆకర్షించలేదు. కాని కోర్టు అమీన్ సర్కారు పాట

"వెయ్యి రూపాయల నగానే" రెండు, మూడు ఐదు దాకా కొండయ్యను దయ దలిచిన బంధువులు అందుకొన్నారు. కారువచ్చి, దుమ్ము రేగిన బజార్లో ఆగిందాకా ఐదే పెద్ద పాట అనుకొన్నారంతా. కారులోంచి, కళ్ళ జోడుతో, నల్లకోటుతో దిగిన కుర్రవాడు—"పదివే లనేసరికి—అమీన్ వులిక్కిపడి— ఒకసారి, రెండుసార్లు, పదివేలు మూడుసార్లు అని ముగించేశాడు.

* * *

వేలం పాటలో ఇల్లు కొన్న రోజుకు భాగ్యమ్మ కొడుకుతో పలికి ఏడేళ్ల నడిచినవి. తల్లి ఖర్చులకు విశ్వనారాయణ పంపిన డబ్బు ఆమెవద్దనలేదు గాని తల్లీ కొడుకూ కలిసి మాట్లాడుకోలేదు.

పెళ్ళినాడు లక్ష్మితోపాటు వంగి తన పాదాలకు సమస్కరించిన కొడుకే. ఆమె చూసిన అతని చివరి చిత్రం. వేలం పాటనుండి విశ్వనారాయణ నేరుగా తల్లివద్దకు కారు పరుగెత్తించాడు. ఆమె పీటమీద కూచొని వుండగా పాదాల ముందు, కోర్టువారి రసీదు వుంచి— "అమ్మా, నేను—నీ కొడుకు విశ్వాన్ని. ఇదుగో నీ ఇల్లు. ఈ రాత్రి దీపం వెలిగించి అక్కడ నిద్రపో అమ్మా!" అన్నాడు.

భాగ్యమ్మ కదల్లేదు, మెదల్లేదు. ఆమె పాదాల మీది రసీదు గాలికి ఎగిరిపోయి, పొంతకుండను దాటుకుంటూ దాలి గుంటలో పడ్డది.

"ఏవమ్మా? నాతో పలకవా?"

ఆమె నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఒక వాక్యం అన్నది.

"నాదో కోరిక వుందిరా విశ్వం. ఇల్లు నాదేనా?"

"అంతకంటేనా అమ్మా"

ఆమె మెల్లిగా లేచింది పీటమీదినుంచి. దాలి గుంట బూడిదనుంచి రసీదు అందుకొని కొడుకు చేతిలో వుంచి—

"నాయనా, యీ కాయితం తీసికెళ్ళి కొండయ్య గారి కిచ్చి నమస్కరించి యిట్లా చెప్పు. ఈ రాత్రి నుండీ ఆ యింట్లో మీరే దీపం వెలిగించుకోమని చెప్పు."

విశ్వనారాయణ రసీదు అందుకొన్నాడు.

కారు అక్కడే విడిచి, నడిచి కొండయ్యగారిని వెతుక్కుంటూ వెళ్లాడు.

○

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక
25-6-1958